# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 2, డిసెంబర్ 2025


## ఎన్నికల ప్రక్రియలో
# అప్రమత్తంగా వ్యవహరించాలి

☆ మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, డిసెంబర్ 01, ప్రభాతవార్త**

రాష్ట్రంలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, నోడల్ అధికారి శంకర్ లతో కలిసి 1వ విడత, 3వ విడత స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బ్యాలెట్ నిర్వహణ, పోలింగ్, కౌంటింగ్ అంశాలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ అనంతరం పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలు, ఏర్పాట్ల పరిశీలన, బ్యాలెట్ పేపర్ల నిర్వహణ, పోలింగ్ రోజున అవసరమైన ఏర్పాట్లు, కౌంటింగ్ కేంద్రాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ, అధికారులు, సిబ్బందికి ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థుల ఎంపిక, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, పోలింగ్, కౌంటింగ్ సమయంలో పాటించవలసిన నియమాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ అనంతరం స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారుల బాధ్యత ఉంటుందని, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ సమయంలో ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ మిగతా 2లో..

# చిన్నారి హత్య కేసులో నిందితుల అరెస్ట్

**లక్షెట్టిపేట/దండేపల్లి, ప్రభాతవార్త**



రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జోన్ దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధి బాలిక మిస్సింగ్, హత్య కేసు ఛేదించడంలో రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వుల మేరకు, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు సీఐ లక్షెట్టిపేట రమణమూర్తి, ఎస్ఐ దండేపల్లి తాహెశీనుద్దీన్, లక్షెట్టిపేట సురేష్, ఎస్ఐ జన్నారం అనూష ఆధ్వర్యంలో టీమ్ దర్యాప్తులో భాగంగా గత నెల 27న ప్రొద్దున బాధితురాలి శవం కొక్కెర మల్లయ్య బావిలో తేలిందని తెలియగా శనిగారపు బాపు, ఉపారపు సతీష్ ఫోన్ మాట్లాడుకొని కలిసి దూరంగా ఎక్కడికైనా పారిపోదామని వాళ్ళు ఇద్దరు ద్వారకా గ్రామ శివారులో కలుసుకొని వారి యొక్క మోటార్ సైకిళ్ళపై మాదాపూర్ నుంచి మ్యాదరిపేట వైపు వచ్చేటప్పుడు సోమవారం మాదాపూర్‌లోని శ్రీ సిద్ధి వినాయక హనుమాన్ టెంపుల్ మాదాపూర్ రోడ్డు వద్ద పోలీస్ వారు పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి అరెస్ట్ చేయడం జరిగింది. నిందితుల వద్ద నుంచి యొక్క 2 మొబైల్ ఫోన్లు, 2 మోటార్ సైకిళ్ళు, బట్టలు, 2 ఖాళీ క్వార్టర్ మద్యం సీసాలు, హుల్కీ ఫుల్కీ చిప్స్ పాకెట్, బాధితురాలి 2 గాజులు, ఒక పట్టాగొలుసు స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితుల వివరాలు.. శనిగారపు బాపు, తండ్రి పోశమ్, వయస్సు 52 సంవత్సరాలు, కులం: ఎస్సీ మాదిగ, గ్రామం: నంబాల, ఉపారపు సతీష్ అలియాస్ సత్తయ్య తండ్రి మొండి, 40 సంవత్సరాలు, మిగతా 2లో..

# పెద్దపులి సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలి

✶ ఎఫ్ఆర్ఓ ముసవీర్ అలీ



**బెజ్జూర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :**



బెజ్జూర్ మండల పరిధిలో పెద్ద పులి సంచరిస్తున్నట్లు ధ్రువీకరించామని సోమవారం ఎఫ్ఆర్ఓ ముసవీర్ అలీ తెలిపారు. సోమవారం ఉదయం కుష్ణపల్లి గ్రామానికి సమీప వాగులో పులి అడుగుల జాడలు కనిపించడంతో వెంటనే అటవీ సమీప గ్రామాల్లో అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. కుష్ణపల్లి, హేటిగూడ, గబ్బాయి, పాపన్నపేట, తలాయి తదితర గ్రామాల్లో డప్పు చాటింపు చేయించారు. పులి సంచారం ఉన్న నేపథ్యంలో అడవి సమీప పత్తి చేన్లలోకి వెళ్లే రైతులు ఒంటరిగా వెళ్లకుండా గుంపులుగా వెళ్లాలని, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పులి సంచారం ఉన్నట్లయితే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. చేన్లలోకి వెళ్లేవారు ఉదయం 8 గంటల వరకు వెళ్లకూడదని, సాయంత్రం 4:00 గంటల లోపు తిరిగి రావాలని సూచించారు. పులి కదలికలపై నిఘా ఉంచినట్లు ఎఫ్ఆర్ఓ ముసవీర్ అలీ తెలిపారు.



# ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

✣ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ పట్టణం, డిసెంబర్ 01, ప్రభాతవార్త**

ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. డిసెంబర్ 01 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం నుండి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత మిగతా 2లో..

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నిపుణుల ద్వారా తరగతులు నిర్వహించాలి

❈ జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి


**ఆసిఫాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నిపుణుల ద్వారా తరగతులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చే కార్యక్రమాలు పాఠశాలలలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నెల 8వ తేదీ లోగా అన్ని ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలలో నిపుణులతో కెరీర్ గైడెన్స్ పై కౌన్సిలింగ్ అవగాహన తరగతులు మిగతా 2లో..



## పాఠశాలలో విద్యార్థులను
# చితకబాదిన టీచర్

**మంచిర్యాల, డిసెంబర్ 1, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆర్‌బిహెచ్‌వి పాఠశాలలో శనివారం ఆరో తరగతి చదువుతున్న ఋషి కుమార్, బ్లేస్సి, అక్షిత్, అశ్విత్ విద్యార్థులను చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పిడిఎస్‌యు, యుఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు, ఆర్‌బిహెచ్‌వి పాఠశాలకు తల్లితండ్రులతో వెళ్లి ఇంగ్లీష్ టీచర్‌ని తొలగించాలని డిమాండ్ చేస్తూ, పాఠశాల ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భం పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి, యుఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా దగ్గరలో ఆర్‌బిహెచ్‌విలో పనిచేసే ఇంగ్లీష్ టీచర్‌ని తొలగించాలని అన్నారు. దీనిపై సంబంధిత విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాధికారి మండల విద్యాధికారి స్పందించి ఆర్‌బిహెచ్‌వి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను

# లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలి

**- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ పట్టణం డిసెంబర్ 01, ప్రభాతవార్త**

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్ గ్రామీణ మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పంచాయితీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చిన వారితో మాట్లాడుతూ, నామినేషన్ కేంద్రంలో అన్ని వసతులు ఉన్నాయా లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లు దాఖలు చేసే వారికి కుల ధ్రువపత్రాల జారీ, బ్యాంకు ఖాతాలు తెరవడంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అడిగారు. అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అన్నారు. సిబ్బందితో మాట్లాడుతూ, హెల్ప్ డెస్క్‌లో అందుబాటులో ఉంటూ, అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు. అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. క్లస్టర్‌లో ఇప్పటి వరకు దాఖలు అయిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల వివరాలు వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకముల ఫారములను తగినన్ని



అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని వివరించారు. ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో డిపిఒ శ్రీనివాస్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో గజానన్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

అవగాహన కల్పించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల సహాయర్థమై జిల్లాలో ఎయిడ్స్ నిర్ధారణ, కౌన్సిలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి అధికంగా ప్రబలే అవకాశం ఉన్న ప్రత్యేక వర్గాలను గుర్తించి ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధి గుర్తించిన బాధితులకు సత్వర చికిత్స అందించాలని తెలిపారు. జిల్లాలో ప్రసూతి మరణాల తగ్గింపులో కిందిస్థాయి సిబ్బంది మొదలుకొని అధికారులు చేపట్టిన చర్యలు అభినందనీయమని అన్నారు. గతంలో ఉన్న ప్రసూతి మరణాల కేసులను అమ్మరక్షిత వంటి వినూత్న కార్యక్రమాల అమలుతో, క్షేత్రస్థాయి సిబ్బంది చొరవతో ప్రసూతి మరణాలు గణనీయంగా తగ్గించగలిగినట్లు చెప్పారు. మున్ముందు ప్రసూతి మరణాల రహిత జిల్లాగా నిర్మాణం తీర్చిదిద్దేలా మరింత పట్టుదలతో పనిచేయాలని తెలిపారు. ర్యాలీ సందర్భంగా కళాజాత బృందాలు డప్పు పాటలతో ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఎంహెచ్ఓ రాజేందర్, డిఎల్ఎస్ఏ సెక్రటరీ రాధిక, డిఈవో భోజన్న, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఐహెచ్ఎఫ్ఎంఎస్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త**



ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయునున్న ఐహెచ్ ఎఫ్ఎంఎస్ కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులకు నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం సమస్యలు పరిష్కరించాలనికోరుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ డిప్యూటీ సూపరిటెండెంట్ కృష్ణకు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ మాట్లాడుతూ ఐహెచ్ఎఫ్ఎంఎస్ టెండర్ల కాలపరిమితి సంవత్సరాలు ముగిసిందని, వెంటనే నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం 26,000 చెల్లించే విధంగా చూడాలన్నారు. పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్మికులకు ఈపీఎఫ్ ఈఎస్ఐ పూర్తి వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం డిసెంబర్ 2 నుంచి 4 వరకు ఆసుపత్రి ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 5న కోఠిలోని మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ కాలేజ్ ముందు ధర్నా కార్యక్రమం ఉంటుందని ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు చిరంజీవి, కోశాధికారి నగేష్, కార్మికులు కృష్ణ, నీల,రాజయ్య, గంగన్న, కమల సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మాన్ని ఆచరిస్తే అది మనల్ని కాపాడుతుంది: ఎమ్మెల్యే

**నేరడిగొండ, ప్రభాతవార్త:**



ధర్మాన్ని ఆచరించండి ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. సోమవారం మండలంలోని బుద్ధికొండ శబరిమాత ఆశ్రమ 20వ వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తి మార్గంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ భగవంతునిపై నమ్మకంతో ముందుకెళితే అంతా మంచే జరుగుతుందన్నారు. శబరిమాత భక్తులు ఎక్కడికెళ్లిన అధిక సంఖ్యలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. ఆశ్రమ ఆవరణలో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టాలని కోరడంతో ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో పాటు రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తానని చెప్పారు. ముందుగా భక్తులు ఎమ్మెల్యేకు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం శబరిమాత పాదుకలకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. శివానంద భారతి స్వామి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్రెడ్డి, నాయకులు రాథోడ్ సురెందర్, జాదవ్ మహేందర్, లవకుమార్రెడ్డి, మహేందర్రెడ్డి, శ్రీకాంత్రెడ్డి, శబరిమాత భక్తులు, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపిలో బిఆర్ఎస్ నేత చేరిక

**తాండూర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :**

తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నేత ఈర్ల సంతోష్ సోమవారం బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నవునూరి సుధీర్ గౌడ్ ఆధ్వర్యంలో బిజెపిలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ సంతోష్ కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్రామాలు అభివృద్ధికి కోట్లాది రూపాయలు విడుదల చేస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను పార్టీ శ్రేణులు అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. సంతోష్ మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలకు ఆకర్షితులైన బీజేపీలో చేరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దూడపాక భరత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి పుల్ల కుమార్, మండల ఉపాధ్యక్షులు కొండు రవి, మండల కార్యదర్శి కుంచ గణేష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి సతీష్, కార్తీక్, రవి, ఉపేందర్, హరీష్, అనిల్ కుమార్, సంతోష్, నరేష్, తిరుపతి పాల్గొన్నారు.



## ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ట్రైనర్లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అనుమానాలు, అపోహలు ఉన్నా శిక్షణ సమయంలో నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు హరి ప్రసాద్, మధు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి హత్య కేసులో నిందితుల అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

కులం: మాదిగ, గ్రామం: నంబాల, దండేపల్లి మండలం. మంచిర్యాల అనువారీగా తెలిపారు. వారు తెలిపిన వివరాల్లోకి వెళితే... ముద్దాయిలు ఇద్దరు నంబాల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన వారు. బ్యాండ్ పని చేసుకుంటూ జీవిస్తారు. శనిగారపు బాపుకి 20 సంవత్సరాల క్రితం పెళ్లి జరిగినది. సుమారు 06 సంవత్సరాల క్రితం అతని భార్య చనిపోయింది. తన కూతురు కొడుకు కూడా అతన్ని వదిలేశారు. ఉపారపు సతీష్ అనునతనికి కూడా గత 5 సంవత్సరాల క్రితం పెండ్లి జరిగి, పెండ్లి అయిన 2 సంవత్సరాల తర్వాత అతనికి తన భార్యతో విడాకులు అయినది. గత నెల 24న శనిగారపు బాపు, ఉప్పారపు సతీష్ ఇద్దరు కలిసి బయట చింత చెట్టు కింద ఆడుకుంటున్న బాధితురాలిని నోరు మూసి ఎత్తుకొని దగ్గరలో పత్తి చేనులో క్రింద పండబెట్టి ఒకరి తర్వాత ఒకరు బాధితురాలిని బలవంతగా అనుభవించినారు. బాధితురాలితో బలవంతగా కామ కోరిక తీర్చుకున్న తర్వాత బాధితురాలిని బయటకు వస్తే ఎవరకైనా చెప్పుతదనే భయంతో ఆమెను చంపాలనే ఉద్దేశ్యంతో ఆమె గొంతు దగ్గర గట్టిగా నొక్కి, తర్వాత ప్రక్కనే ఉన్న కొక్కెర హరీష్ వాళ్ళ యొక్క వ్యవసాయ బావిలో పడేసినారు. ఈ కేసు ఛేదించడంలో కృషి చేసిన మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్ ఆధ్వర్యం లో నాలుగు బృందాలు సీఐ లక్షెట్టిపేట రమణమూర్తి, ఎస్ఐ దండేపల్లి తాహెశినుద్దీన్, లక్షెట్టిపేట సురేష్, ఎస్ఐ జన్నారం అనూష, హెడ్ కానిస్టేబుళ్లు గౌస్, గంగ నాయక్, వసంత్, జహీర్, ఆనంద్, కానిస్టేబుళ్ల లను డీసీపీ అభినందించారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నిపుణుల ద్వారా తరగతులు నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రూప్ 1 అధికారులు, ఇతర అధికారులు తాము ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించిన తీరు, పోటీ పరీక్షలకు సన్నద్ధమైన విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆ దిశగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు తమ భవిష్యత్తును బంగారు మయంగా మలుచుకునేలా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ఎస్ఓ దేవాజీ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతిభ గల కుంగ్‌ఫు విద్యార్థులకు ఎల్లో బెల్టుల ప్రదానం

**మందమర్రి, డిసెంబర్ 01, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని సింగరేణి హై స్కూల్ మైదానంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కుంగ్ ఫు దు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అకాడమీకి చెందిన 29 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎల్లో బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని అకాడమీ మాస్టర్ జెట్టి కృష్ణ నిర్వహించగా, అసిస్టెంట్ గ్రాండ్ మాస్టర్ హరికృష్ణ, రాజేష్, అనూష, రామ్మోహన్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. కుంగ్ ఫు శిక్షణతో లభించే ప్రయోజనాలు. ఈ సందర్భంగా మాట్లాడిన గురువులు కుంగ్ ఫు శిక్షణ వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక ఏకాగ్రత, ఆత్మరక్షణ నైపుణ్యాలు, క్రమశిక్షణలాంటివి ఎలా పెంపొందుతాయో వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ఈ శిక్షణ ప్రాముఖ్యత తెలియజేశారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థుల సందడికార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అకాడమీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా గీతా జయంతి వేడుకలు

**సారంగాపూర్, డిసెంబర్ 01, ప్రభాతవార్త:**

గీతా జయంతి పురస్కరించుకొని మండలంలోని అన్ని పాఠశాలల్లో వేడుకలు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో భగవద్గీత అంశంపై క్విజ్ పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్వాధ్యాయ పరివారానికి చెందిన పోతన్న మాట్లాడుతూ భగవద్గీత మానవుని దైనందిన జీవనానికి దిశానిర్దేశం చేసే గ్రంథమని, నేటి యువత తప్పనిసరిగా దీనిని అధ్యయనం చేయాలని సూచించారు. భారతీయ ఆచార-సంప్రదాయాలను, సాంస్కృతిక మూలాలను వివరించే గ్రంథమై భగవద్గీత చెడుపై మంచి ఎలా విజయం సాధిస్తుందో తెలియజేస్తుందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కూడా ఉద్యమకారులు గీతా స్ఫూర్తితో విదేశీ వస్తువుల బహిష్కరణకు పూనుకున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులు 12వ అధ్యాయంలోని భక్తి శ్లోకాలను ఆలపించారు. వారికి పాఠశాల ఉపాధ్యాయులు, స్వాధ్యాయ పరివారము శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రెండోసారి బాబాపూర్ సర్పంచ్ స్థానం ఏకగ్రీవం

ఉట్నూర్, డిసెంబర్ 01, ప్రభాతవార్త:



మండలంలోని బాబాపూర్ గ్రామ పంచాయతి సర్పంచ్‌తో సహా ఎనిమిది మంది వార్డు మెంబెర్‌లను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామస్తులు, పటేల్ ఆధ్వర్యంలో సమావేశమై సర్పంచ్‌గా మెస్రం గంగాదేవి ప్రభాకర్‌ని ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఎన్నుకున్నారు. గతంలో కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. రెండో సారి కూడా ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికలను పూర్తిచేశారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సారంగాపూర్, డిసెంబర్ 01, ప్రభాతవార్త:

మండలంలోని జాం గురుకుల విద్యార్థినిలు అస్మితఖేలో ఇండియా నిర్వహించిన కిక్ బాక్సింగ్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన కిక్ బాక్సింగ్ పోటీలలో విద్యార్థులు అంకిత పసిడి పథకాన్ని, చిన్మయి కాంస్య పథకాన్ని గెలుచుకున్నారు. వీరు డిసెంబర్ 6న సంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలను వారి తల్లిదండ్రులను, పిఈటి సుస్మిత, పిడి సుప్రియలను కళాశాల ప్రిన్సిపల్ బి సంగీత, కళాశాల సిబ్బంది అభినందించారు.

## యువత సామాజిక సేవలో ముందుకు రావాలి

ఉట్నూర్, డిసెంబర్ 01, ప్రభాతవార్త:



యువత సామాజిక సేవలో ముందుకు రావాలని శ్రీ సేవా ఫౌండేషన్ చైర్మన్ జాదవ్ వసంత్ రావు, శ్రీ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు బెస్ట్ ఫోటో గ్రాఫర్ చవాన్ సేవా దాస్‌లు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని ఉదనాయక్ తండా(ఎందా) గ్రామస్తులు అజేపీ అబ్దుల్ కలం నంది అవార్డు అందుకున్న జాదవ్ వసంత్ రావు, చవాన్ సేవాదాస్‌ను శాలువాలతో సన్మానించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వసంత్ రావు, సేవాదాస్‌లు మాట్లాడుతూ శ్రీ సేవా ఫౌండేషన్‌ను సామాజిక సేవా చేస్తూ ఇతరులకు సహాయం చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేశామన్నారు. యువత చదువుతో పాటు సామాజిక కార్యక్రమంలో పాల్గొని ఈ సంస్థని ముందుకు తీసుకువెళ్లలన్నారు. ఈ కార్యక్రమంలో జీవన్ కుమార్, రాథోడ్ దిగంబర్, చవాన్ కరణ్, అరవింద్, హరిలాల్, రావుజీ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాల పరిశీలన

వేమనపల్లి, ప్రభాతవార్త



మండలంలోని సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ కేంద్రాలను, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య సోమవారం పరిశీలించారు. నీల్వాయి గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కేంద్రాల్లో చేపట్టాల్సిన పనులు, విధులపై వివరించారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వీరితో ఎంపీడీవో కుమారస్వామి, ఆర్ఐ ఖాలిక్, అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్



అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

# షీ టీమ్, మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

*** సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి * మహిళల భద్రత కోసం టీ-సేఫ్ యాప్**
*** మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్**

నస్పూర్, డిసెంబర్ 01, ప్రభాతవార్త

షీ టీమ్, మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆక్స్‌ఫోర్డ్ హైస్కూల్‌లో విద్యార్థులకు షీ టీమ్, మహిళా చట్టాలు, పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నియమాలు, టీ-సేఫ్ యాప్‌లపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ పోక్సో చట్టం లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టమని, 2012లో వచ్చిన ఈ పోక్సో చట్టం 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుంది అని వారిపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్షలతో పాటు మరణ శిక్ష కూడా విధిస్తారని అన్నారు. విద్యార్థినులు ఆకతాయిల వేధింపులకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే డయల్ 100కు లేదా షీ టీమ్ నంబర్‌కు ఫోన్ చేయాలని, వేధింపులను నిర్లక్ష్యం చేయకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో స్నేహం చేయడం, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవడం వంటి వాటితో అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ వేధింపులకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇంచార్జి ఎస్ఐ ఉషారాణి మాట్లాడుతూ చిన్న పిల్లల శరీర భాగాలపై ఎవరైనా అపరిచితులు అనుచితంగా తాకినప్పుడు లేదా ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించినప్పుడు అది బ్యాడ్ టచ్ అని గ్రహించి, వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని వివరించారు. విద్యార్థినిలు, మహిళల భద్రత కోసం టీ-సేఫ్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, అత్యవసర పరిస్థితుల్లో దానిని ఉపయోగించే విధానం గురించి వివరించారు. షీ టీమ్ సేవలు, వాటి ఉద్దేశాన్ని గురించి వివరిస్తూ, ఎప్పుడూ అందుబాటులో ఉండే డయల్ 100 లేదా రామగుండం షి టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షి టీమ్ నంబర్ 8712659385 అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆక్స్ ఫోర్డ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ జస్టిన్, వైస్ ప్రిన్సిపాల్ సోనూ, ఉపాధ్యాయులు, షి టీమ్ సిబ్బంది మహిళా కానిస్టేబుల్ శ్రీలత, కానిస్టేబుల్ సతీష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల వితరణ

సారంగాపూర్, డిసెంబర్ 01, ప్రభాతవార్త:



మండలంలోని కొట్ల(బి) గ్రామంలోని పెద్దమ్మ తల్లి దేవాలయానికి సీసీ కెమెరాలను సోమవారం ఏర్పాటు చేశారు. సుంకరి పరుశురాం భీమన్న కుటుంబ సభ్యులు రూ. 25000 విలువైన సీసీ కెమెరాలు పెద్దమ్మ దేవాలయంలో పెట్టించారు. ఆలయ పరిసరాలను నిరంతరంగా పర్యవేక్షణలో ఉంచుతాయని ఆలయ పూజారి లక్ష్మణ్ తెలిపారు. పూజారి వారి పేరిట అర్చన చేసి ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరారు.

## ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన సదస్సు

బెజ్జూర్,డిసెంబర్ 1,ప్రభాతవార్త

బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధికి ఇప్పటివరకు మందులు లేవని కావున నివారణ ఒకటే మార్గమని అన్నారు.ఇది అంటూ వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి మాత్రమే అని అన్నారు.అరక్షిత శృంగారం,రక్త మార్పిడి వల్ల వస్తుందని కావున ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని వైద్యులు శ్రావణ్,శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.





నామినేషన్ వేసిన సర్పంచ్ అభ్యర్థి వడ్డేటి నాగమణి

## సిర్పూర్(టి)లో 26 నామినేషన్లు

సిర్పూర్ (టి), డిసెంబర్ 1, ప్రభాతవార్త :

మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం సోమవారం రెండో రోజు సర్పంచ్ వార్డ్ మెంబర్ల పోటీ కోసం అభ్యర్థులు నామినేషన్ కేంద్రాల్లో నామినేషన్ దాఖలను చేశారు. మండలంలో 16 గ్రామపంచాయతీల గాను నామినేషన్ల కోసం 6 క్లస్టర్ల వారిగా నామినేషన్లు స్వీకరించారు. సర్పంచ్ పోటీ కోసం 13నామినేషన్లు వార్డ్ మెంబర్లు కోసం 13 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. మొత్తం 26 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవో తెలిపారు.

## విద్యతోనే అభివృద్ధి సాధ్యం

లక్షెట్టిపేట, డిసెంబర్ 01, ప్రభాతవార్త



విద్యార్థులకు పాఠాలు మంచిగా బోధించాలని లక్షెట్టిపేట ఎంఈఓ శైలజ సూచించారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాది చదువని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దీనా, ఉపాధ్యాయులు, వేణుగోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

**✪ ఎం.పి.డి.ఓ సత్యనారాయణ**

జైపూర్, డిసెంబర్ 01, ప్రభాతవార్త

సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని ఎం.పి.డి.ఓ గుర్రం సత్య నారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఎం.పీ.డి.ఓ కార్యాలయంలో ఎం.ఆర్.ఓ వనజా, ఎం.పి.ఓ బాపు రావులతో కలిసి ఆర్.ఓ, ఏ.ఆర్.ఓ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో కో ఆర్డినేషన్, సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశం ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ వనజా రెడ్డిలు మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఐదు క్లష్టర్‌లలో 20 పంచాయతీలకు సంబందించిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డ్ సభ్యులు నామినేషన్ దాఖలు చేయాలని అన్నారు. క్లష్టర్‌ల వివరాలు: జైపూర్: 1.జైపూర్, 2.వెంకట్రావ్‌పల్లి, 3.పెగడపల్లి, 4.గంగిపల్లి, 5.ఎల్కంటి, మిట్టపల్లి: 1.మిట్టపల్లి, 2.నర్వ, 3 కానుకూరు, 4. ముదిగుంట, ఇందారం: 1.ఇందారం, 2. టేకుమట్ల, 3.రామారావు పేట, శేట్‌పల్లి: 1.శేట్‌పల్లి, 2.నర్సింగాపూర్, 3.బెజ్జాల, 4.కుందారం, వేలాల: 1.వేలాల, 2.పౌనూర్, 3.శివ్వారం, 4.కిష్టా పూర్, ఆర్.ఓ, ఏ.ఆర్.ఓల వివరాలు: 1.జైపూర్ నామినేషన్ కేంద్రం: బి. ప్రసాద్,జే. సత్తయ్య, 2.మిట్టపల్లి నామినేషన్ కేంద్రం: సంగీత భార్గవి జె. పోచన్న 3. ఇందారం నామినేషన్ కేంద్రం: జి. కవిత అండ్ కే. రమేష్ 4. శేట్‌పల్లి నామినేషన్ కేంద్రం: రవీందర్ అండ్ కే. మహేష్ బాబు, 5.వేలాల నామినేషన్ కేంద్రం: బి. శ్రీకాంత్ అండ్ రవి. అభ్యర్థులు నామినేషన్ కేంద్రాల వద్ద అధికారులను అడిగి అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.పి.డి.ఓ

# ఎన్నికల సమయంలో అసాంఘిక చర్యలకు తావివ్వొద్దని సూచన

రామకృష్ణాపూర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త




గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమల్లో ఉందని రామకృష్ణాపూర్ ఎస్సై జి. రాజశేఖర్ తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరి భావోద్వేగాలు దెబ్బతినేటట్లు వ్యాఖ్యలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర విషయాలు ప్రచురించడం, వర్గాల మధ్య ఉద్రిక్తతలకు దారితీసే మాటలు మాట్లాడటం చట్టపరంగా శిక్షార్హమని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ చర్యలకు పాల్పడిన వ్యక్తులపై ఎలక్షన్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ కేసులు ఎన్నికల అనంతరం కూడా పోలీసు రికార్డుల్లో కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు చోటుచేసుకోకుండా చూడాలని సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు రాజకీయ పక్షాలకు అతీతంగా, శాంతియుత వాతావరణంలో సాగాలంటూ ఎస్సై రాజశేఖర్ పిలుపునిచ్చారు. అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

# గనులు, విభాగాలలో మౌలిక వసతులు కల్పించాలి

**- ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్రావు**

నస్పూర్, డిసెంబర్ 01, ప్రభాతవార్త

శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఐఎన్టీయూసీ ప్రతినిధి బృందం - డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్ తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు మాట్లాడుతూ ఆర్.కె 5, ఎస్సార్పీ 3, ఐ.కె 1ఏ, ఆర్.కె 7 గనులలో కార్మికులకు రెస్ట్ హాల్స్, టాయిలెట్లకు అత్యవసర మరమ్మతులు చేపట్టాలని, మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక మౌలిక వసతులు కల్పిచాలని, పిట్‌హెడ్‌ల వద్ద స్నానాల గదులు, లాకర్లు కలిగిన రూమ్స్‌కు తక్షణ రిపేర్లు చేయాలని డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్ళగా, సానుకూలంగా స్పందించి ఏరియా జీఎం పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, కార్పొరేట్ పరిధిలో ఉన్న సమస్యలను ప్రతిపాదనలు పంపి, త్వరితగతిన పరిష్కారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి కేంద్ర ఉపాధ్యక్షులు గరిగ స్వామి, జీవన్ జోయల్ తదితరులు పాల్గొన్నారు.


డీజీఎం (సివిల్)తో ఐఎన్‌టియుసి నాయకులు


ఎన్నికల కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

# ఎన్నికల కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

సారంగాపూర్, డిసెంబర్ 01, ప్రభాతవార్త:

మండలంలోని సారంగాపూర్, జామ్ ఎన్నికల కేంద్రాలను స్థానిక సబ్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సోమవారం పరిశీలించారు. ముందుగా తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌లను కలిసి స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన క్లస్టర్‌లలో నామ పత్రాల కేంద్రాలను పరిశీలించారు. అధికారులతో నామ పత్రాలు దాఖలైన ప్రక్రియపై సమాచారాన్ని తెలుసుకొన్నారు. స్థానిక ఎన్నికలలో నామ పత్రాల కేంద్రాల వద్ద ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని నామ పత్రాల సమయంలో ఎక్కువ మందిని లోనికి అనుమతించవద్దని, స్థానికంగా ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ అజీజ్ ఖాన్, అధికారులు రమేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

# ఉత్సాహంగా నామినేషన్ దాఖలు

తాండూర్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :

*మండలంలో రెండో విడత జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు సోమవారం ఉత్సాహంగా నామినేషన్ దాఖలు చేశారు. అభ్యర్థులు నాయకులు కార్యకర్తలు అనుచరులతో కలిసి నామినేషన్ కేంద్రాలకు తరలివచ్చి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ సమయం ముగిసినప్పటికీ కొందరు అభ్యర్థులు ముందుగానే టోకెన్ తీసుకొని రాత్రి 7:00 అయిన కేంద్రాల వద్ద తమ నామినేషన్ పత్రాలను నింపుతూ కనిపించారు. నామినేషన్ కేంద్రాల వద్ద తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్, మాదారం ఎస్ఐ సౌజన్య సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.*


పోలింగ్ కేంద్రం వద్ద కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది


నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థులు

# ప్లాస్టిక్ బదులుగా బట్ట సంచులను వాడాలి

ఆసిఫాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :

ప్లాస్టిక్ బదులుగా బట్ట సంచులను వాడాలని కోరుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో పర్యావరణం కాపాడటంపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్ ఆధ్వర్యంలో కరపత్రాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో చెత్తను కాల్చడం చేయకూడదని, తడి, పొడి చెత్తను వేరుచేయాలని, నీటిని పొదుపుగా వాడాలని, చెట్లను నాటి వాటిని సంరక్షించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రముఖ్ ఉడుతల శ్రీలక్ష్మి, సైదం శ్రీ రాం సత్యనారాయణ, శ్రీకాంత్, బిళ్ళ అనూష,ఆత్రం కిరణ్ తదితరులు పాల్గొన్నారు


అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు